క్లుప్తంగా

ఓయూ రిజిస్ట్రార్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు అందుకుంటున్న ఓయూ రిజిస్ట్రార్

లాలాపేట: ఉదయ్‌పూర్‌లోని జనార్దన్ రాయ్‌నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్ డీమ్డ్ యూనివర్సిటీలో ఈ నెల 12 నుంచి 13 వరకు జరిగిన ప్రతిష్టాత్మక 47వ అఖిల భారత అకౌంటింగ్ మహాసభల్లో జాతీయ స్థాయిలో ఓయూ తన అకడమిక్ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఈ సందర్భంగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ నరేష్‌రెడ్డి , పరిశోధక విద్యార్థి డాక్టర్ ప్రీతితో కలిసి ఉమ్మడిగా పరిశోధన పత్రాన్ని సమర్పించారు. దీంతో పాటు పలువురు ఓయూ అధ్యాపకులు పలు కీలక ఉపన్యాసాలు చేశారు. ఈ సభల్లో ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపిక కావడంతో ప్రొ జి. నరేష్‌రెడ్డి, డా.కె. ప్రీతి అవార్డు అందుకున్నారు. ఈ సభలకు ఓయూ, కాకతీయ యూనివర్సిటీ, వాటి అనుబంధ వాణిజ్య కళాశాలల విభాగాల నుంచి 35 మంది హాజరయ్యారు.

షాట్‌గన్ షూటింగ్‌లో తెలంగాణకు రెండు పతకాలు



బహుమతులు అందుకుంటున్న షూటర్లు

రాంగోపాల్‌పేట: షాట్‌గన్ షూటింగ్ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌- 2025 పోటీల్లో తెలంగాణకు చెందిన షూటర్లు బంగారు, కాంస్య పతకాలు సాధించారు. అక్టోబర్ 11 నుంచి 14 వరకు చెన్నైలోని రైఫిల్‌క్లబ్‌లో 16వ సౌత్‌జోన్ షాట్‌గన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన తుమ్మలపల్లి అగస్త్యరెడ్డి, వెన్న నవీన్‌కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. వారిరువురు హైదరాబద్‌లోని చేతన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుశ్చేరి నుంచి షూటర్లు పాల్గొన్నారు. మంగళవారం తమిళనాడు పోలీస్ కమిషనర్ టీ శంకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో తమిళనాడు రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షులు డీవీఎస్‌రావు, అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు రాజరాజగోపాల్ తొండైమాన్, శ్రీరవి, కార్యదర్శి రాజశేఖర్ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు ఆహ్వానం



ఎమ్మెల్యే తలసానిని ఆహ్వానిస్తున్న హమాలీ బస్తీవాసులు..

సనత్‌నగర్: పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో ఈ నెల 26న బొడ్రాయి పండుగ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను హమాలీబస్తీ వాసులు పద్మారావునగర్ బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిసి బొడ్రాయి పండుగకు ఆహ్వానించారు. హమాలీబస్తీ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని తాము కోరిన వెంటనే బొడ్రాయి ప్రతిష్ఠ జరిపించారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బొడ్రాయి ప్రతిష్ఠ జరిగి మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 26న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్‌గౌడ్, బస్తీవాసులు సంపత్, కుషాల్, సత్యనారాయణ, నర్సింగ్, కాంతారావు, దుర్గ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత

సికింద్రాబాద్: అక్రమంగా తరలిస్తున్న గంజాయి చాక్లెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 10లో మంగళవారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి వద్దకు వెళ్లి అతడి బ్యాగును సోదా చేయగా అందులో 1600 కిలోల గంజాయి చాక్లెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి పారిపోయాడు. గంజాయి చాక్లెట్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

గోదాం దాటని బతుకమ్మ చీరలు

స్టేడియానికే పరిమితం

- నెల రోజులుగా గోదాంలోనే 36 వేల చీరలు
- ఇందిరమ్మ జయంతి రోజు పంపిణీకి ఏర్పాట్లు
- 1.44 లక్షల మహిళలకు పంపిణీ చేయాలని లక్ష్యం
- ఒక్కో పొదుపు మహిళకు రెండు చీరలు
- జీహెచ్ఎంసీ అధికారుల కసరత్తు



లాలాపేట స్టేడియంలో భద్రపరిచిన ఇందిరమ్మ చీరలు

పంపిణీ చేయాల్సిన చీరలు: 1,44,000
తొలివిడత వచ్చిన చీరలు: 36,000
ఇంకా రావాల్సిన చీరలు: 1,08,000

సికింద్రాబాద్: మహిళలకు ప్రీతిపాత్రమైన బతుకమ్మ వేడుక సందర్భంగా పంపిణీ చేయాల్సిన ఇందిరమ్మ చీరలు నెల రోజులుగా లాలాపేటలోని స్టేడియంలోని స్టోర్ రూమ్‌లకు పరిమితం అయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలందరికీ రేషన్ కార్డుల ప్రాతిపదికన బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం ఇందిరా మహిళా శక్తి పొదుపు సంఘాల మహిళలకు మాత్రమే ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించారు.

- బతుకమ్మ పండగ సందర్భంగా పంపిణీ చేసేందుకు గత నెల 12న 36 వేల చీరలు సికింద్రాబాద్‌కు చేరాయి. మిగతా చీరలు వచ్చాక పంపిణీ చేసేందుకు అధికారులు పండగకు ముందే అన్ని ఏర్పాట్లు చేసినా మిగతా చీరల దిగుమతి జరుగలేదు. ఈ కారణంతో బతుకమ్మ వేడుక సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టలేదు.

సర్కిల్ పేరు	పొదుపు మహిళలు
1.సికింద్రాబాద్	25,000
2.బేగంపేట	11,000
3.అంబర్‌పేట	19.000
4.ముషీరాబాద్	17,000
మొత్తం మహిళలు	72,000

నవంబర్ 19న పంపిణీకి ఏర్పాట్లు...

పొదుపు సంఘాల మహిళలకు బతుకమ్మ వేడుక కోసం చీరలు అందించాల్సిన కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. అన్ని సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాల్లో పొదుపు సంఘం ఖాతాబుక్కును చూపించి పేర్లు నమోదు చేసుకుని మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ సరిపడా చీరల దిగుమతి కాలేదు.

- అంతేగాక పండుగ సందర్భంగా కొందరు మహిళలకు మాత్రమే చీరలు పంపిణీ చేస్తే విమర్శలు వస్తాయని భావించిన అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. నవంబర్ 19న మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

1.44 లక్షల చీరల పంపిణీ...

జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయ పరిధిలో ఐదు సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో మల్కాజిగిరి సర్కిల్‌లో చీరల పంపిణీ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సికింద్రాబాద్, బేగంపేట, ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ కార్యాలయాల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు జోనల్ కార్యాలయ అధికారులు పంపిణీ వ్యవహారాలు చూస్తున్నారు. నాలుగు సర్కిళ్లలో 72 వేల మంది మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఒక్కో పొదుపు మహిళకు 2 చీరల చొప్పున మొత్తంగా 1.44 లక్షల చీరలు పంపిణీ చేయనున్నారు.

అర్బన్ కమ్యూనిటీ అధ్వర్యంలో...

ఆయా సర్కిళ్ల పరిధిలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనున్నారు. పొదుపు సంఘాల మహిళల రుణాలు తదితర వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) అధికారుల పర్యవేక్షణలో చీరలు పంపిణీ చేయనున్నారు. ఒక్కో మహిళా సంఘం పరిధిలో 8 నుంచి 13 వరకు సభ్యులు ఉన్నారు. ఒక్కో మహిళకు రెండు ఇందిరమ్మ చీరలు అందించే వ్యవహారాలను ఆయా డివిజన్ అర్బన్ కమ్యూనిటీ ఆఫీసర్ నేతృత్వంలో రిసోర్స్ పర్సన్లకు అప్పగించనున్నారు.

ఎంచుకునే కోర్సులపై అవగాహన తప్పనిసరి

అమీర్‌పేట: ఉన్నత చదువుల కోసం సిద్ధపడే విద్యార్థులు తాము ఎంచుకునే కోర్సుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.చల్లప్ప అన్నారు. జయహో జాలాది సేవా సంస్థ ఆధ్వర్యంలో యువతీ యువకులు, విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అమీర్‌పేట జిజ్ఞాస్ స్టూడియోలో మాజీ ఐఏఎస్ అధికారి దినకర్‌బాబుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుటి వారిని చూసి కోర్సులను ఎంచుకోవడం కంటే నైపుణ్యం కలిగి ఉన్న కోర్సులను ఎంచుకుని జీవితంలో స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బీటెక్, ఎంబీఏ పూర్తి చేసినా నైపుణ్యం లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు.

- అలాంటి వారి కోసం కేరీర్ గైడ్‌లైన్స్ వంటి శిక్షణ సంస్థలు దోహదపడతాయన్నారు.యువతో పాటు పెద్దలకు సైతం శిక్షణలు అవసరమయ్యే రోజుల్లో ఉన్నామని మాజీ ఐఏఎస్ అధికారి దినకర్‌బాబు అన్నారు. కష్టపడితేనే నైపుణ్యాభివృద్ధి జరుగుతుందన్నారు.



జయహో జాలాది వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారులు చల్లప్ప, దినకర్‌బాబు

- జయహో జాలాది వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకునే విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు జాలాది రత్న సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ శిక్షకులు నందిగం నవీన్ ,దిలీప్, రవిచంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న డీసీపీ రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట: ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల విద్యార్థులు మరింత జాగ్రత్తగా ఉండాలని ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా సుభాష్ రోడ్‌లోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో మహంకాళి పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలతో పాటు లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవద్దన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా, ఎక్కడైనా వీటిని వినియోగిస్తున్నట్లు, విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డయల్ 100, రహదారి భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోపాలపురం, మార్కెట్, రాంగోపాల్‌పేట్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

దుర్వాసనకు కారణమయ్యే పరిశ్రమలపై కఠిన చర్యలు

సనత్‌నగర్: బల్క్ డ్రగ్, కెమికల్ పరిశ్రమల నుంచి దుర్వాసనలు వస్తున్నాయంటూ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై టీజీపీసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్ జోన్ కార్యాలయంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాచుపల్లి, జీడిమెట్ల, నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, ఉప్పల్ ప్రాంతాల్లోని పరిశ్రమలు, టీఎస్‌డీఎఫ్, జేఈటీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 48 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దుర్వాసనలకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దుర్వాసనలు రాకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అలాగే పరిశ్రమల పెట్రోలింగ్ టీమ్‌ల ద్వారా నియమిత స్వీయ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ బందాలు కాలుష్య నియంత్రణ బోర్డు రాత్రి పహారా బృందాలతో సమన్వయం చేసుకుంటూ దుర్వాసన మూలాలను గుర్తించి నివారించాల్సిందిగా ఆదేశించారు. దుర్వాసన సమస్యలకు కారణమవుతున్న, నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని అధికారులు హెచ్చరించారు. సమావేశంలో మేడ్చల్, రంగారెడ్డి ప్రాంతీయ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల రాత్రి పహారా డ్యూటీ షీట్లను రూపొందించి సమావేశంలో అందించారు.



బల్క్ డ్రగ్స్, రసాయన పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో టీజీపీసీబీ అధికారులు..

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.23, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 40, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 23, క్యారెట్ 47, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 24, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 6–7, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సైబర్ నేరాలపై అవగాహన

అడ్డగుట్ట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోల్సిన అవసరం ఉందని అడిషనల్ డీసీపీ అశోక్, ఏసీపీ సుబ్బయ్య అన్నారు. మంగళవారం రాత్రి తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలు, డ్రగ్స్, లైంగిక వేధింపులపై అవగాహన ఉండాలన్నారు. డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా, గేమింగ్ ప్లాట్ ఫామ్, అన్ సేఫ్ వెబ్‌సైట్ల వాడకం ద్వారా చాలా మంది ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు. అటువంటి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బయ్య, డీఐ శ్రీను, ఎస్ఐ కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ ఉద్యోగులకు వాకీటాకీలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ ఉద్యోగులకు వాకీటాకీలు అందజేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం వాకీటాకీలను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతగా ఆలయ కార్యనిర్వహణ అధికారి, సూపరింటెండెంట్‌తో కలిసి మొత్తం 9 మందికి వాటిని అందజేసినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అమీర్‌పేట: వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఫిట్‌గా, చురుగ్గా ఉండాలని ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. మంగళవారం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ 4వ ఎడిషన్ సన్నాహక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పచ్చదనం పెంపు, ఆరోగ్య పరిరక్షణనే లక్ష్యంగా సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. నవంబర్ 9 నుంచి 15 వరకు నిర్వహించ తలపెట్టిన ప్లాంటేషన్ వీక్ సామగ్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఖేలో ఇండియా తరహాలో గ్రాన్యూల్స్ హారతి విప్లవం పేరుతో ఈ యేడాది 10 వేల చెట్లు నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ప్రకృతితో మమేకం కావాల్సిన అవసరముందన్నారు.పర్యావరణ పరిరక్షణ, క్రీడలు,ఆసక్తి ఉన్న రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. శంషాబాద్ సమీపంలోని ఖానా శాంతి వనంలో వచ్చేనెల 16న గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్‌లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సంజయ్ సెహ్గల్,పారా అథ్లెటిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ అకిరా నందన్ బానోతు, గ్రాన్యూల్స్ ఇండియా ప్రతినిధి ఉమా చిక్కురుపాటి, రచనా మెహ్తా, సంజీవ్ దూగర్ తదితరులు పాల్గొన్నారు.



హార్ట్‌ఫుల్‌నెస్ రన్ కరపత్రికను ఆవిష్కరిస్తున్న జయేష్‌రంజన్

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



సంఘీభావం ప్రకటిస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నేతలు

లాలాపేట: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నేతలు బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర బంద్‌కు అన్ని విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్నీ దేశమంతటికి తెలియజేదం కోసమే బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు ఆపేది లేదన్నారు.

బీసీలకు న్యాయబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లను అగ్రవర్ణాలు కోర్టుల ద్వారా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీలంతా బంద్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: కార్డియో పల్మనరీ రిసక్టేషన్ (సీపీఆర్)పై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని గాంధీ అనస్తీషియా ప్రొఫెసర్ కిరణ్ మాదల అన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ (ఎన్ఈఎల్ఎస్) గాంధీ అనస్తీషియా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో పలువురికి సీపీఆర్‌పై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. హార్ట్‌ఎటాక్ సమయంలో సీపీఆర్‌తో బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి నేతృత్వంలో నిర్వహించిన అవగాహన శిబిరంలో వైద్యులు ప్రొఫెసర్ కిరణ్‌మాదల, డాక్టర్ జుబైర్, జైనబ్, పైసల్‌తోపాటు పలువురు వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు అంబాజీ నాయక్

అడ్డగుట్ట: ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధించి ఆమె మరణానికి కారణమైన యువకుడిని లాలాగూడ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అంబాజీ నాయక్ రైల్వే డిగ్రీ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్న మౌలిక అనే విద్యార్థిని ప్రేమ పేరుతో వేధించాడు. దీంతో మనస్తాపానికి గురైన మౌలిక బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న అంబాజీ కోసం గాలింపు చేపట్టారు. ఘటన జరిగిన రోజే పారిపోయిన అంబాజీ మొదట నిజామాబాద్‌కు, అక్కడి నుంచి తిరుపతి, వికారాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

క్రమశిక్షణ, అంకితభావంతోనే ఉన్నత శిఖరాలు

రాంగోపాల్‌పేట: విద్యార్థులు క్రమ శిక్షణ, అంకితభావంతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సనాతన ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సుబ్రహ్మణ్యం అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన సతీమణి జ్ఞాపకార్థం మంగళవారం రూ. లక్ష విలువైన షూస్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదని ఎంతో మంది మేధావులు పేదరికం నుంచి ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి కోసం కృషి చేస్తే లక్ష్యం ఎంత పెద్దదైనా వారి చెంతకు చేరుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతి కోసం హెచ్ఎం శౌరి ఎంతో కృషి అభినందనీయమన్నారు. అనంతరం 360 మంది విద్యార్థులకు షూస్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చిన్నాబత్తిని శౌరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా



సనత్‌నగర్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు కలిగిన ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ చెక్‌పోస్టుతో పాటు సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాల్లో బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ నరేష్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 పోలింగ్ బూత్‌లు ఉండగా రెండు పోలింగ్ లొకేషన్లను సమస్యాత్మకంగా గుర్తించారు. అయా ప్రాంతాల్లో సైబరాబాద్ కమిషనర్ బందోబస్తును పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు.

ప్రమోషన్ల నిలిపివేత దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

లాలాపేట: ప్రతిభా నైపుణ్యం పేరుతో అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా సీఏఎస్ ఇంటర్వ్యూల్లో రిజెక్టు చేయడం దారుణమని ఔటా అధ్యక్షులు ప్రొ మనోహర్ అన్నారు. ఈ మేరకు ఓయూలో సైన్స్ కళాశాల వద్ద మంగళవారం సీఏఎస్ ఇంటర్వ్యూల్లో ప్రమోషన్లు రాని పలువురు అధ్యాపకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఔటా అధ్యక్షులు మాట్లాడుతూ సీఏఎస్ ఇంటర్వ్యూల్లో మినిట్స్‌ను రికార్డు చేయకుండా ఇంటర్వ్యూలను లోపభూయిష్టంగా నిర్వహించారని ఆరోపించారు. 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా తిరస్కరించారని అందుకు కారణాలను మాత్రం ఇప్పటి వరకు వెల్లడించడం లేదన్నారు. బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతను సైతం రిజెక్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూజీసీ నిబంధనల మేరకే ప్రమోషన్స్ ఇంటర్వ్యూలు జరిపి ఉంటే ఇప్పటికైనా ఓయూ వైస్ చాన్సలర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అధ్యాపకులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నిజ నిర్ధారణ కమిటీనీ వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేశ్వర్‌రావు, వెంకటదాస్, రోజారాణి, సుజాత, అపర్ణ, సురేందర్‌రెడ్డి, అరవింద్, నతానియేలు, రవీందర్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

45 వాహనాలు సీజ్



రాంగోపాల్‌పేట: సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిపై ట్రాఫిక్ గోపాలపురం పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించా. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోపాలపురం పోలీసులు రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి 45 వాహనాలను సీజ్ చేశారు. సోమ, మంగళవారాల్లో సంగీత్ చౌరస్తా, కీస్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పాటలు వింటూ కొందరు డ్రైవింగ్ చేస్తుండగా కొందరు ఆటో డ్రైవర్లు రీల్స్ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. ఇలాంటి వారితో ఇతర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. గతంలో ఇలాంటి అనేక ఘటనలు చోటు చేసుకోవడంతో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. ఈ కేసులో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కౌన్సెలింగ్‌కు పంపిస్తామని, కోర్టుకు వెళ్లి జరిమానా చెల్లించిన తర్వాత వాహనాలను రిలీజ్ చేస్తామని తెలిపారు. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని ఆయన సూచించారు.